



పునః ప్రతిష్ఠాపనకు హాజరైన భక్తులు

కొలువుదీరిన అడెల్లి పోచమ్మకు కోటి మొక్కులు

- నూతన ఆలయంలో కొలువుదీరిన శక్తి స్వరూపం
- అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే ఏలేటి
- ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రులు అల్లోల, వేణుగోపాలచారి


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలో మహా ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహాపోచమ్మ నూతన ఆలయంలో శుక్రవారం కొత్తరూపంలో అడెల్లి మహా పోచమ్మ కొలువు దీరింది. నూతన ఆలయంలో పునః విగ్రహస్థాపన, కార్యక్రమాన్ని వేద పండితులు ఐదు రోజుల పాటు నిత్య ఓమాలు, ప్రత్యేక పూజలు అనంతరం శుక్రవారం వేకువజామున ప్రాణ ప్రతిష్ఠాపన ఉత్సవం నిర్వహించి, నిత్యనిధి, యంత్రసాయి, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహానివేదన పూర్ణహంతి, కుంబాభిషేకం, సహస్ర కళాభిషేకం, ప్రతమ హారతి పుష్పము, ఆశీర్వచనలు కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారిని ప్రతిష్ఠించి వేద పండితులు హారతినిచ్చారు. ఈ కార్యక్రమానికి పీఠాధిపతి సుదర్శన దండి స్వామి హాజరయ్యారు.

పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే ఏలేటి దంపతులు

నూతన ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను మొక్కారు. వేద పండితులు హారతినిచ్చి తీర్థ ప్రసాదాలను అందజేసి కానుకలను సమర్పించారు. అనంతరం వేద పండితులు శాలువతో సన్మానించారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

అడెల్లి మహాపోచమ్మ నూతన ఆలయంలో పున విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలలతో పాటు మహారాష్ట్ర నుంచి వాహనాలలో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయంలో నూతనంగా కొలువు దీరిన అమ్మవారికి పూజలు చేసి మొక్కులను మొక్కి అమ్మవారి బండారిని పెట్టుకున్నారు. సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పునఃవిగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రశాంతంగా ముగియడంతో ఎస్పీ జానకీ షర్మిల పోలీసులను అభినందించారు.


విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన పీఠాధిపతి సుదర్శన దండి


బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

పంట దిగుబడులు తారుమారు

- వర్షాలు, వరదలతో సాగు లక్ష్యంపై ఆశలు గల్లంతు
- ఇప్పటికే మొదలైన ధాన్యం కొనుగోళ్లు
- సోయా దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పత్తిపై ఆశలు గల్లంతు

నిర్మల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలు, మారుతున్న వాతావరణం కారణంగా అన్ని రకాల పంటల దిగుబడుల లక్ష్యం తారుమారయింది. మొ దట్లో అధికారులు ఊహించిది ఒకటి.. మారిన పరిస్థితుల కారణంగా అయ్యింది ఒకటి. మొత్తం పంటల లక్ష్యం ఈ సారి గణనీయంగా తగ్గిపోతుండడం అటు రైతులను ఇటు అధికార వర్గాలను ఆందోళనకు గురి చేస్తోంది. మొద ట్లో అధికారులు సాగు లక్ష్యాన్ని ఖరారు చేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ఈ సారి ఖరీఫ్‌లో గణనీయంగా దిగుబడులు వస్తాయని ఆశించారు. అయితే వర్షాల కారణంగా చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వర్షం ఇష్టానుసారంగా కురియడంతో చాలా చోట్ల పంటలు నష్టపోయాయి. అధికారులు మొదట్లో ప్రాథమిక సర్వే జరిపినప్పటికి ఆ సర్వే అనంతరం మళ్ళీ వర్షాలు కురియడంతో పం ట నష్టంపై క్షేత్రస్థాయి లెక్కలు గతితప్పుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల లెక్క ప్రకారం ప్రస్తుత ఖరీఫ్‌లో 1,27,225 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. అయితే దీనికి అనుగుణంగా దిగుబడి లక్ష్యం 2, 10,065 మెట్రిక్ టన్నుల ధాన్యంగా లెక్క కట్టారు. అయితే మొదట్లో ఊహించిన దానికి భిన్నంగా భారీ వర్షాలు ఇష్టానుసారంగా కురియడంతో దిగుబడులపై తీవ్ర ప్ర భావం పడింది. అలాగే లక్ష ఎకరాల్లో పత్తి, మరో లక్ష ఎకరాల్లో సోయా, 60వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న పంటను సాగు లక్ష్యంగా నిర్ధారించారు. అయితే భారీ వర్షాలతో జరిగిన నష్టం కారణంగా అన్ని పంటల దిగుబడులు గణనీయంగా తగ్గిపోనున్నాయని రైతులు అం దోళనకు గురవుతున్నారు.

జిల్లాలో మొదలైన వరి కొనుగోళ్లు

కాగా నిర్మల్ జిల్లాలో ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనుగోళ్లను ప్రారంభించాయి. నిర్మల్ జిల్లాలో మొత్తం 351 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దొడ్డు, సన్న రకం ధాన్యానికి వేరు వేరు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐకేపీ ద్వారా 173, పీఏసీఎస్ ద్వారా 149, డీసీఎంఎస్ ద్వారా 24, జీసీసీ ద్వారా 5 కొనుగోలు కేంద్రాలను ఏ ర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు మొత్తం నిర్ధారించిన ధా న్యానికి 52 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కానున్నాయి. ప్రస్తుతం 25 లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉండడంతో మిగతా అన్ని బ్యాగులను రప్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


ఖానాపూర్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఇంకా అందని బోనస్ డబ్బులు..

కాగా గత యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ డబ్బులు రైతులకు ఇప్పటి వరకు అందకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం యాసంగిలో సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. దీని ప్రకారం జిల్లాలో 4483 మంది రైతులకు 12.80 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ డబ్బులు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోయాపై ఆశలు గల్లంతు..

సోయా పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్ని గల్లంతయ్యాయి. మొదట్లో సోయా పంట దిగుబడులు భారీగా వస్తాయని సంబుర పడ్డ రైతులపై భారీ వర్షాలు వారి ఆశలను వమ్ము చేశాయి. వరుస వర్షాలతో పంట నీట మునిగిపోయింది. దీంతో పాటు ఆరబెట్టిన పంట సైతం వర్షార్పణం అయ్యింది. దాదాపు లక్షకు పైగా ఎకరాల్లో సాగు చేసిన సోయా పంట పెద్ద ఎత్తున దిగుబడి ఇస్తుందని భావించారు.

దిగుబడులు తగ్గుతాయి..

- అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నిర్మల్



జిల్లాలో భారీ వర్షాల కారణంగా పంటలు ఎక్కువగా నష్టపోయాయి. దీని కారణంగా దిగుబడులు తగ్గుతాయి. వరితో పాటు సోయా బీన్, పత్తి పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఆగస్టు 27 వరకు పంటల పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ఆ తరువాత మారిన వాతావరణం, ఇష్టానుసారంగా కురిసిన వర్షాలతో పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. దీంతో దిగుబడులు తగ్గనున్నాయి.

ఉపాధ్యాయుల నిలదీత

- మస్కాపూర్ పాఠశాల వద్ద ఘర్షణ వాతావరణం


కుటుంబ సభ్యులను సముదాయిస్తున్న స్థానికులు

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అత్యుత్సాహమే తన కొడుకు ప్రాణం తీసిందని ఇటీవల చోటుచేసుకున్న మస్కాపూర్ ఘటనతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న ఓ బాలుడి తల్లి చెల్ల గంగామణి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మస్కాపూర్ పాఠశాల వద్దకు వెళ్లిన బాధిత కుటుంబ సభ్యులు తమ కుమారుడు చేసిన తప్పేంటని ఉపాధ్యాయులను నిలదీశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న వీడీసీ సభ్యులు, గ్రామస్థులు వారిని వారించే ప్రయత్నం చేశారు. తీవ్ర వాగ్వాదం జరుగుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దయానంద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, ఎస్సై రాహుల్ ఇరువర్గాలను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సీఐ అజయ్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కాగా మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం శంకర్‌ను వివరణ కోరగా జరిగిన ఘటన తమ పాఠశాలకు సంబంధించినది కాదని బీసీ వసతి గృహంలో జరిగిందన్నారు. విద్యా వలంటీర్ పుప్పాల స్వప్న మాట్లాడుతూ.. తనపై బాధిత కుటుంబ సభ్యులు దాడి చేశారని తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2025-26లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


క్రీడాకారుల పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సోన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన 11వ జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2025-26లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం హ్యాండ్ బాల్ ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, జమాల్, ఉదయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కడెం ఎంపీడీవో బి.అరుణ సస్పెన్షన్

- ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్ రెడ్డి
- సమయపాలన పాటించడం లేదని వేటు

కడెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడెం ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న బి.అరుణ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. కడెం మండలంలో ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో కడెం ఎంపీడీవో అరుణ హాజరు కాలేదు. ఎంపీడీవో ఆ కార్యక్రమానికి హాజరు కాలేదు. ప్రతి రోజు విధులలో కూడా నిర్లక్ష్యం వహిస్తున్నారని కలెక్టర్ ఆరా తీయడంతో వెలుగులోకి రావడం జరిగింది. జిల్లా కలెక్టర్ స్వయంగా నిర్మల్ జడ్పీ సీఈవో గోవింద్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఎంపీడీవోను సస్పెండ్ చేసినట్లు సీఈవో గోవింద్ తెలిపారు. దీంతో కడెం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీవో విధులు నిర్వహిస్తున్న రమేష్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అందజేశారు.

సుజలాం సుఫలాం.. మాతరం

- వందేమాతరానికి 150 ఏళ్లు
- వందేమాతర గేయాన్ని ఆలపించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వందేమాతర గేయాన్ని ఆలపించారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు మేడిసెమ్మె రాజు, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, నాయకులు జమాల్, పట్టణ నాయకులు శ్రీరామోజు నరేష్, జట్టు దినేష్, జప ప్రసాద్, మాజీ కౌన్సిలర్ పాతర్ల గణేష్, సుంకరి రాజేష్, శ్రీకాంత్ రెడ్డి, ఉదయ్ గౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


వందేమాతరం గేయాలాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

జాతీయ గౌరవానికి ప్రతీక వందేమాతరం..

- నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల

దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన వందే మాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వందేమాతరం జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల ఐపీఎస్ నేతృత్వంలో జిల్లా పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది అంతా కలిసి సమిష్టిగా వందే మాతరం గీతాన్ని రెండు స్తోత్రాలతో కూడిన ప్రామాణిక రూపంలో సమూహ గానంగా ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... వందే మాతరం గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం భారత మాత పట్ల భక్తి, త్యాగం, దేశాభిమానానికి ప్రతీక అని తెలిపారు. ఈ వేడుకలు ప్రతీ భారతీయుడిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయన్నారు. జాతీయ గీతం పట్ల గౌరవ భావాన్ని పెంపొందించాలని, దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, డీపీవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా పోలీస్ కార్యాలయంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నీటి పారుదల శాఖ కార్యాలయంలో..

బంకిం చంద్ర చటర్జీ వందేమాతరం గీతం రచించి నేటికీ 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఉద్యోగులందరూ వందేమాతర గీతం ఆలపించడం జరిగింది. మన దేశం వందల సంవత్సరాల పైగా పరాయి పాలనలో ఉండడం స్వాతంత్ర్యం కొరకు పోరాటం చేసిన, ప్రాణ త్యాగాలు చేసిన నాయకులను గుర్తు చేసుకోవడం జరిగింది. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో డి.వెంకట రాజేంద్ర ప్రసాద్ సూపరిండెంట్ ఇంజనీర్, ఎం. లక్ష్మీ, డిప్యూటీ సూపరిండెంట్ ఇంజనీర్, టీఎన్జీవోస్ అధ్యక్షులు వెలుమల ప్రభాకర్, ఉద్యోగులందరూ పాల్గొన్నారు.

దీక్ష జూనియర్ కళాశాలలో...

పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రమోద్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలోల వందేమాతరం గీతాలాపన..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధాకర్ మాధ్నూరే అధ్యక్షత వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి జెండాలు ఊపుతూ దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వందేమాతరం పాట భారత జాతి ఐక్యతకు ప్రతీకమని, ప్రతి విద్యార్థి దేశభక్తి విలువలను ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జాకీర్ హుస్సేన్, జి. అర్చన, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అటవీ కార్యాలయంలో..

పట్టణంలోని జిల్లా అటవీ కార్యాలయంలో వందేమాతర గీతం ఆలపించినట్లు డీఎఫ్‌వో నాగిని భాను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్, ఎఫ్‌డీవో శివ కుమార్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సామూహిక వందేమాతరం గేయాలాపన వేడుక

- పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జాతీయ గేయం వందేమాతరం రచించి 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా కలెక్టర్, అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వందే మాతరం గేయం ఎంతో మంది సమరయోధుల్లో స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించడంలో కీలక భూమిక పోషించిందన్నారు. బంకించంద్ర చటర్జీ, 1875 నవంబరు 7న జాతీయ గేయం వందే మాతరం రచించడం జరిగిందని వివరించారు. జాతీయ గేయం, జాతీయ గీతం భారత దేశ సమైక్యత, దేశభక్తిని పెంపొందించడంలో నే టికీ కీలక భూమిక పోషిస్తున్నాయని వివరించారు. ఈ రోజు వందేమాతరం ఆలాపన కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం ఎంతో గర్వించదగ్గ విషయమని చెప్పారు. జాతీయ గేయం స్ఫూర్తితో అధికారులంతా ఉన్నత భావాలను కలిగిఉండి, దేశాభివృద్ధిలో నిరంతరం తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టర్, అధికారులు వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న దృశ్యం

కార్తీక శోభ

- బాసరలో భారీగా భక్తుల తాకిడి
- గోదావరి తీరాన పుణ్యస్నానాలు, దీపారాధనతో మహిళల మొక్కులు


కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు

బాసర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి దేవి కొలువైన బాసర పుణ్యక్షేత్రం కార్తీక మాసం శోభతో వెలిగిపోతోంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ మాసం మొదటి రోజు నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా పవిత్ర గోదావరి నది తీరాన పుణ్య స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేయడానికి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఒడ్డున దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. నదీ తీరంలోని శివాలయంలో అభిషేక పూజలు నిర్వహించి, సర్వపాపాలు తొలగిపోవాలని, కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కలగాలని దీపారాధన చేశారు. అనంతరం సరస్వతి అమ్మవారిని దర్శించుకుని, అక్షరాభ్యాస పూజల్లో పాల్గొన్నారు.


గోదావరి నదికి నిత్య హారతి నిర్వహిస్తున్న ఆలయ పండితులు

ప్రతిరోజూ గోదావరి హారతి పూజ

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బాసర సరస్వతి దేవస్థానం ఆదివారం గోదావరి హారతి పూజ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిరోజు సాయంత్రం సంధ్య వేళల్లో పండితులు అమ్మవారికి వివిధ హారతులతో పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రతీ కార్తీకమాసంలో వస్తుంటాం

రేఖ, భక్తురాలు ,నిజామాబాద్



ఉదయాన్నే చల్లటి గోదావరి నీటిలో స్నానం చేసి ఉన్నది ఒడ్డున కార్తీకదీపం వెలిగిస్తే ఆధ్యాత్మికత అనుభూతి మాటల్లో చెప్పలేం అందుకే ప్రతి కార్తీక మాసంలో బాసర వచ్చి ఇక్కడ పూజలు నిర్వహిస్తాం.

నది స్నానం శివుడి దర్శనం ఇక్కడి ప్రత్యేకత

స్వరూప, భక్తురాలు



పవిత్ర గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించిన తర్వాత నది ఒడ్డున గల శివాలయంలో కార్తీక దీపారాధన నిర్వహించాం. తర్వాత సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నాం. నది స్నానం, శివుడి, చదువుల తల్లి దర్శనం ఒకే చోట చేసుకోవచ్చు.

సాదాబైనామాలపై కీలక ముందడుగు

- నర్సాపూర్(జి) రైతన్నలకు పట్టాల ఆశ

నర్సాపూర్ (జి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 2020లో (జీవో 112 ప్రకారం) తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించింది. అప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియ నర్సాపూర్ మండలం కుస్లీ గ్రామ శివారు భూములకు సంబంధించి వేగం పుంజుకుంది. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు నవత జ్యోతి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో దరఖాస్తులు, భూముల వివరాలపై (సర్వే నెంబర్ 582, 579) క్షేత్రస్థాయి విచారణ జరిగింది. ఆర్.ఎల్లక్క, ఎల్లప్ప వంటి రైతులు తమకు త్వరలో పట్టా పాస్ పుస్తకాలు అందుతాయని ఎన్నో ఏళ్ల భూ సమస్యకు మోక్షం లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. విచారణ త్వరగా పూర్తి చేయాలని రైతులు అధికారులను కోరారు.



సాదాబైనామా అప్లికేషన్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

సోయా కొనుగోళ్లు..

సజావుగా సాగేనా?

- ప్రారంభమైన సోయా కొనుగోలు కేంద్రాలు
- కొనాలంటే షరతులెన్నో..
- మార్కెట్‌లో నెల రోజులుగా రైతన్నల పడిగాపులు
- నిబంధనల మేరకే తేమ శాతం
- మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు
- వర్షాలకు రంగు మారిన సోయా
- బయోమెట్రిక్ విధానం అమలుతో కొనుగోలు



మార్కెట్‌లో తడిసిన పంటను ఆరబెడుతున్న రైతులు

చెత్తచెదారం, తుక్కును చన్నీ ద్వారా వేరు చేస్తున్న దృశ్యం

ఇచ్చోడ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగు కోసం పడుతున్న కష్టాల కంటే వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు రెట్టింపు కష్టపడుతున్నారు. యూరియా కొరత.. నకిలీ విత్తనాలు.. ప్రతికూల వాతావరణం.. అకాల వర్షాలు.. ఇవన్నీ దాటి చేతికందిన పంటను మద్దతు ధరకు అమ్ముకోలేక రైతులు కుదేలవుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన సోయా కొనుగోళ్లు సాజావుగా సాగేతాయో లేదో చూడాలి.

జిల్లాలో 60వేల ఎకరాలలో సోయాను సాగు

జిల్లాలో పత్తి పంట తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది సోయా పంట. గతేడాది 80వేల ఎకరాల్లో సోయా సాగు కాగా, ఈ ఏడాది 60 వేల ఎకరాలకే పరిమితమైంది. వరుస వర్షాలతో పంటలో దిగుబడి తగ్గింది. జిల్లాలో 24వేల మంది రైతులు 60వేల ఎకరాలలో సోయాను సాగు చేశారు. దిగుబడి అంచనా 5లక్షల క్వింటాళ్లుగా ఉంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5,328 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.4600కు మించి ధర ఇవ్వడం లేదు. ప్రభుత్వం మార్క్ ఫెడ్ సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాను కారణంగా జిల్లా లో పలు ప్రాంతాల్లో పంట తడిసిపోయింది. దీంతో పలువురు రైతుల పంటకు మొలకలు రావడం మరికొందరి పంటలకు ధాన్యం మొత్తం నలుపు రంగులో ఉండడంతో రైతులు ఇబ్బందులను ఏదుర్కొంటున్నారు.

మద్దతు ధరకు అడ్డుగా నాణ్యత ప్రమాణాలు

సోయాబిన్ పంటకు విపణీలో తక్కువ ధర ఉండడంతో రాష్ట్రప్రభు త్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది. మద్దతు ధర పొందాలంటే నాణ్యత ప్రమాణాలకు తగ్గట్టుగా పంట ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. తేమ 12 శాతం లోపు, చెత్తాచెదారం కలిగిన గింజల 3శాతం లోపు ఉండాలనే నిబంధలు పెట్టారు. అదే వ్యాపారులు తేమ ఎక్కువగా ఉంటే ఒక్కో శాతానికి కిలో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో విడతల వారిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సోయాబిన్ పంటలను కొనుగోలు చేపడుతున్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉందని, నిబంధనల మేరకు తేమశాతం ఉండేలా చూసుకొని షెడ్యూల ప్రకారం మార్కెట్‌కు పంటన తీసుకొని రావాలని మార్క్‌ఫెడ్ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మొత్తం 10 సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, తాంసి, జైనథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, బేల మార్కెట్‌ల పరిధిలో కొనుగోళ్ల ప్రారంభించి కొనుగోళ్ల చేపడుతున్నారు.

తేమ శాతంతో సంబంధం లేకుండా పంట కొనుగోలు చేయాలి

● కాట్‌పెల్లి చంద్రశేఖర్, రైతు, ఇచ్చోడ



అధిక వర్షాలతో సోయా దిగుబడి తగ్గింది. పంట చేతికి వచ్చేకాలంలో వర్షాలు కురవడంతో పంటను తీసే క్రమంలో తేమశాతం పెరిగింది. మార్కెట్‌లో అధిక తేమశాతం ఉంటే సోయాబిన్‌లో కట్టె, తుక్కు, చెత్తచెదారం ఉంటే కొనుగోలు చేయడం లేదు. తేమ శాతాన్ని చూడకుండా సోయా కొనుగోళ్లు చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలను రైతులకు కల్పించాలి.

20 రోజులుగా ఎదురుచూపులు

● ముస్కు రమేష్ రెడ్డి, రైతు, పిప్రి



సోయాబిన్ పంట చేతికి వచ్చి సుమారు 20రోజులు అవుతోంది. పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. ప్రైవేటు వ్యాపారులు రూ.వెయ్యి వ్యత్యాసంతో పంటను కొనుగోలు చేస్తామంటున్నారు. గతిలేని పరిస్థితుల్లో మార్కెట్లో 20రోజులుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి. మార్కెట్‌లో షెడ్లు లేక వర్షాలకు పంటలు తడుస్తున్నాయి. టార్పాలిన్ల సౌకర్యాలను సైతం కల్పించాలి.

చిగురిస్తున్న 'డబుల్' ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఫైనల్ చేసే అవకాశం కన్పిస్తోంది.

ప్రాధాన్యత క్రమంలో కేటాయింపు

మున్సిపల్ పరిధిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. లబ్ధిదారులను ఎల్1, ఎల్2, ఎల్3 మూడు కేటగిరీలుగా విభజించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మున్సిపల్ పరిధిలో 12,000 మంది అర్హులైన లబ్ధిదారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో అత్యంత పేదరికం, కుటుంబ పరిస్థితిని పరిగణలోకి తీసుకొని ఎలాంటి వసతి లేని నిరుపేదలకు మొదట డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించనున్నారు. తీవ్రమైన పోటీ ఉండడంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సవాల్‌గా మారనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు

బోథ్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్ధరి గ్రామంలో గత వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శీతాకాలం శిబిరాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ముత్యంరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిబిరాలలో గ్రామస్తులకు అనేక కార్యక్రమాలపై అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. శిబిరాలలో విద్యార్థులు చెప్పిన విషయాలను గ్రామస్తులు ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీ సాయి, కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్, మాజీ సర్పంచ్ బండారు శ్రీధర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నగేష్‌తో పాటు గ్రామ పెద్దలు గంగాధర్, బోజారెడ్డి, అల్లం రవి, సాయికుమార్, స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి గిరిజన భాషా ఉత్సవాలకు జిల్లా గిరిజనులు



మనోహర్



దేవరావు

ఉట్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయస్థాయి గిరిజన భాషా ఉత్సవాలకు జిల్లాకు చెందిన గిరిజనులు హాజరుకానున్నారు. రచయిత, విశ్రాంత బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెస్రం మనోహర్, ఐటీడీఏ గోండి భాష కోఆర్డినేటర్ తొడసం దేవరావులను ఆహ్వానించడంతో దేశ రాజధానిలోని యశోభూమిలో నిర్వహిస్తున్న గిరిజన ఉత్సవాలకు పాల్గొనేందుకు వెళ్లారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న రాథోడ్ జీవన్

నేరడిగొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను ఏర్పాటు చేసి, పశువులకు టీకాలువేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లు వ్యవసాయంతోపాటు పశు పోషణపై దృష్టిసారించాలని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

విఠల రుక్మిణి ఆలయంలో ప్రత్యేక పూజలు

మావల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విఠల రుక్మిణీ ఆలయంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో గల విట్టల రుక్మిణీ ఆలయంలో కార్తీక మాసంను పురస్కరించుకుని నిర్వహించిన కాకడ హారతి, సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ

ఇంద్రవెల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల -1లోని అంబేద్కర్ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్ప్‌వీల్ ఫౌండేషన్ తరపున విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్లు, గిర్మిట్, ఏరేసర్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్ప్ వీల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంబ్లే అతీశ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం జాదవ్ గోవింద్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ఉపాధ్యక్షుడు సావంత్ రాజవర్ధన్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఈవోను కలిసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఉట్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి రాజేశ్వర్‌ను శుక్రవారం ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ జాదవ్ కలిశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి రాజేశ్వర్‌కు సంఘం డైరీ అందించి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు బెజ్జంకి రవీంద్ర, జాదవ్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో గీతాలపన చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా, అదనపు కలెక్టర్లు, అధికారులు



మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద వందేమాతరం గీతాలాపన చేస్తున్న గ్రామస్థులు

పండుగలా వందేమాతరం గేయాలాపన

- జిల్లావ్యాప్తంగా జాతీయ గీతం ఆలాపన
- జాతీయ గేయం దేశ భక్తికి ప్రతీక: కలెక్టర్ రాజార్షిషా

మావల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ గేయం దేశభక్తికి ప్రతీక అని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. జాతీయ గేయం వందే మాతరం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం ఘనంగా సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షిషా పాల్గొని అధికారులతో కలిసి వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఆత్మలాంటిదని, స్వాతంత్ర్య సమరయోధుల్లో దేశభక్తిని జ్వాలంతం చేసిన గీతమిదేనని పేర్కొన్నారు. వందేమాతరం గీతం ప్రాధాన్యత అపారమైందని, ప్రతీ భారతీయుడి హృదయంలో దేశాభిమానాన్ని మేల్కొలిపిన శక్తి ఈ గీతమన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ సంస్థల్లో అధికారులు, సిబ్బంది సామూహికంగా పాల్గొని వందే మాతరం గీతాన్ని ఆలపించారని తెలిపారు. మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ భారతీయ సంస్కృతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ కీర్తించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన వందేమాతరం

ఇంద్రవెల్లి: స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న భారతీయుల గుండెల్లో వందేమాతర గేయం ఉద్యమ స్ఫూర్తిని నింపిందని మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్ రావు అన్నారు. వందేమాతర గేయాన్ని రచించి 150 ఏళ్లు గడిచిన సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో వందేమాతరం గేయాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది జైస్వాల్ శంకర్ లాల్, ఇద్రిష్, గాయక్ వాడ్ నారాయణ, సామాజిక కార్యకర్త మల్లేల సుందర్, తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: నార్నూర్ గాంధీ చౌక్ వద్ద స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు, విద్యార్థులు సామూహిక వందేమాతర గీతాలాపన గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు పవర్ అనిత, కర్మన్ కార్ బ్రిజిలాల్, యశ్వంత్ రావ్ చౌవాన్, సురేష్ ఆడె, మెస్రం హన్మంతురావు, సుల్తాన్ ఖాన్, దళిత రత్న అవార్డు గ్రహీత కొర్రెల మహేందర్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వందేమాతరం ఆలాపన

ఉట్నూర్: ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయం ఆవరణలో సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా వందేమాతరం రచించిన బంకిన్‌చంద్ర చటర్జీ చిత్రపటానికి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది అధికారులు సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. కార్యక్రమంలో డీడీ అంబాజీ జాదవ్, ఈ ఈ తానాజీ జాదవ్, జీసీసీ ఇన్‌చార్జి డీఎం గుడిమల్ల సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది వందేమాతరం సామూహిక గీతాలాపన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బంకీ చంద్ర చటర్జీ 150వ జయంతి సందర్భంగా వారి గొప్పతనాన్ని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ సువర్ణ, శ్రీలత,గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్, తిరుపతి, దత్తు, అశ్విన్ చౌహాన్, విష్ణు, నిలోఫర్, రానా పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీవో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గీతా లాపన చేశారు. వేదం పాఠశాలలో విద్యార్థులు 150 సంవత్సరాల ఆకారంలో ప్రదర్శన చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. గ్రామపంచాయతీలో ఈవో అంజయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొని వందేమాతరం పాడారు ఎంపీడీవో కార్యాలయంలో రమేష్ ఎంపీడీవోతో పాటు విద్యార్థులు పాల్గొని వందేమాతరం ప్రాముఖ్యతను చాటి చెప్పారు.

మావల : సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలాపన చేశారు. పట్టణంలోని కే ఆర్కే ప్రభుత్వ పాఠశాలలో లయన్స్ ఆఫ్ కింగ్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో చెట్లు నాటారు. అనంతరం విద్యర్థులకు బహుమతులు అందచేశారు. అదేవిధంగా కృష్ణా వేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ సల్ల విజయ బాబు యాదవ్ మాట్లాడారు. వందేమాతరం గీతం ప్రజలలో చైతన్యం రగిలించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ నవీన్ యాదవ్ లయన్స్ క్లబ్ ఆఫ్ కింగ్ జిల్లా అధ్యక్షుడు చందా అశోక్, జోనల్ కార్యదర్శి ప్రకాష్, లయన్ ప్రేమ్ రాజ్ గౌడ్, పాఠశాల సిబ్బంది, శ్రీరామ్, కిషోర్ శృతి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: ప్రతిఒక్కరికి దేశభక్తి కలిగి ఉండాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో 150వ సంవత్సర వందే మాతరం గీతాన్ని ఆలకించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో భాగంగా వందేమాతర గీతాన్ని రచించడం జరిగిందన్నారు. ఎంతో మంది త్యాగమూర్తుల పోరాటంతోనే భారతదేశానికి స్వతంత్రం వచ్చిందన్నారు. అనంతరం సామూహికంగా వందే మాతర గీతాన్ని ఆలకించారు. ఇందులో ఎంపీడీవో శంకర్, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ ఐటీడీఏ ఆవరణలో బంకిన్‌చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో



గీతాలాపన చేస్తున్న ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్, డీడీ అంబాజీ జాదవ్‌తోపాటు కార్యాలయ అధికారులు



వాహనం ఆపి వాహనం ముందున్న జాతీయజెండా ముందు నిల్చుని జాతీయ గేయాన్ని పాడుతున్న ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంచిర్యాల రోడ్డుకు మరమ్మతులు

- చెడిపోయిన బీటీ వేసేందుకు ఆర్‌అండ్‌బీ చర్యలు



బీర్ సాయి పేట్ వద్ద రోడ్డుపై గుంతలు చదును చేస్తున్న కూలీలు



కొత్తగూడెం అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద ప్రారంభమైన ఫాస్ట్‌ట్రాక్

ఉట్నూర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం చెక్‌పోస్ట్ నుంచి గండి పోచమ్మ ఆలయం వరకు చెడిపోయిన రోడ్డు గుంతలకు మరమ్మతులు చేసి బీటీ వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 3న 'రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ కింద రూ.లక్షలు మంజూరు చేయడంతో వర్షాలు తగ్గుముఖం పట్టగానే రోడ్డు భవనాల శాఖ అధికారులు శుక్రవారం పనులు ప్రారంభించారు. 6కిలోమీటర్ల పరిధిలో గుంతలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ మనీష్ వెల్లడించారు.



బీర్సాయి పేట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

మా తుజే సలాం.. వందేమాతరం

నిర్మల్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని స్థానిక విజయ ఉన్నత పాఠశాలలో జాతీయ గేయం 150వ సంవత్సరాల వసంతాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న వందేమాతర గేయ ఆలాపనలో భాగంగా వందేమాతరాన్ని ముక్తకంఠంతో ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న దృశ్యం

కావేరి లైబ్రరీలో...

డా.కావేరి లైబ్రరీ వందేమాతరం 150 సంవత్సరాల వందేమాతర గీతాలాపన చేసి, దీన్ని రచించిన బంకిం చంద్ర చటర్జీని స్మరించుకున్నారు. లైబ్రేరియన్ పి.దీపక్ మాట్లాడుతూ... వందేమాతరం పోరాట స్ఫూర్తి గీతం, ఉద్యమానికి ఎంతో మనోబలం తెచ్చింది. దీనికి 24 జన వరి, 1950 జాతీయ హోదా వచ్చిందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహ లైబ్రేరియన్ లోలం రాజమణి, పాఠకులు సంతోష్, సత్యం, కిశోర్, స్వామి, ప్రవీణ్, నిఖిత, శైలజ, పూజ, చరిత, స్రవంతి పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ ఇంద్రానగర్‌లో..

భారతీయ జనతా పార్టీ ఇంద్రానగర్ కార్యాలయంలో సామూహిక వందేమాతరం ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న భూమయ్య మాట్లాడుతున్న స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన గీతం వందేమాతరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, నిర్మల్ జిల్లా మా జీ ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, జిల్లా కోశాధికారి అల్లం భాస్కర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు దశరథ్ పోశెట్టి, బీజేపీ నిర్మల్ జిల్లా మాజీ కార్యదర్శి కొరిపల్లి శ్రావణ్ రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు రజిని వైద్య, బీజేపీ నిర్మల్ జిల్లా నాయ కులు రావుల రాము, లింబాద్రి పాల్గొన్నారు.

వందేమాతర గీతం ఆలాపన

లక్ష్మణచాంద: 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతర గీతం ఆలపించాలని కేంద్రం నిర్ణయించటంతో శుక్రవారం మండలంలో ఆ గీతాన్ని ముక్తకంఠంతో ఆలపించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాకింగ్ క్లబ్‌లు, యువజన సంఘాలు వందేమాతర గీతాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటుకున్నారు.

కడెం: వందే మాతరం జాతీయ గీతాన్ని మహా కవి శ్రీ బంకిం చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కడెం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ రొడ్డ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని దేశభక్తి భావాన్ని చాటారు.

నర్సాపూర్(జి): దేశభక్తికి అద్దం పడుతూ, నర్సాపూర్ తహసీల్దార్ కా ర్యాలయంలో శుక్రవారం వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. బంకిం చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేర కు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీ కాంత్, డిప్యూటీ తహసీల్దార్ వాహిద్ ఉద్దీన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు నవత జ్యోతి, సుమలత, గ్రామ పాలన అధికారులు ఆఫీస్ సిబ్బంది కళ్యాణి, రాజు సామూహికంగా గీతాన్ని ఆలపించి తమ దేశభక్తిని చాటుకున్నా రు. నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాల్లో వందేమాతరం వేడుక లు జరిగాయి. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో జాతీయ సమైక్యతను, దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో కొనసాగుతున్నాయి. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గొప్పతనాన్ని నేటి తరానికి గుర్తు చేయడంలో ఈ కార్యక్రమం విజ యం సాధించింది.

ముథోల్: మండల కేంద్రంలో రబీంద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వందేమాతర గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సాయినాథ్ మాట్లాడుతూ... వందేమాతర గీతం భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు. దాని ద్వారా మనకు దేశభక్తి భావం పెంపొందుతుంది అన్నారు.

తానూర్: మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం వందేమాతరం గీతాలపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని సామూహిక వందేమాతరం ఆలపించారు.

బాసర: కోట్ల మంది భారతీయుల్లో స్వాతంత్రోద్యమ దీప్తిని రగిలించిన వందేమాతరం గేయానికి నేటితో 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలో ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో కార్యాలయాల్లో ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో అధికారులు, విద్యార్థులు వందేమాతర గేయాన్ని ఆలపించి ఉత్సవాలలో పాల్గొన్నారు.

కుబీర్: వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వందేమాతరం గీతాలప కార్యక్రమాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కుబీర్‌లోని ఆయా పాఠశాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలలో వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. శ్రీ సరస్వతి శిశుమందిర్ మండల కేంద్రం కుబీర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పాఠశాల అధ్యక్షులు ప్యాట లక్ష్మణ్, పాఠశాల కార్యదర్శి పుప్పాల పీరాజీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం గేయం యొక్క విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు సూది రాజన్న, వడ్నం దత్తాత్రి, సున్నపు శంకర్, ప్రధానాచర్యులు, ఆచార్యులు, విద్యాఘలు పాల్గొన్నారు.



నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన



తానూర్ తహసీల్దార్ కార్యాలయంలో..



కుభీర్‌లో వందేమాతర గీతాలపన కార్యక్రమం

బీటీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్టా గ్రామం నుండి విట్టోలి తండా వరకు రూ. 3.5 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డు పనులను శుక్రవారం రాత్రి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. 8 కిలో మీటర్ల పొడవునా రెనివల్ బీటీ రోడ్డు పనులు జరిగే రవాణా ఇబ్బందులు దూరమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రోడ్ల పరిస్థితి తెలుసు కాబట్టి దశలవారీగా మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. దశల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని ఎడ్‌బిడ్ తండా, చింతకుంట తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావు పటేల్, ఏఎంసీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డీఈఈ సునీల్ కుమార్, నాయకులు రాజేష్ బాబు, కిష్టారెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సాగౌడ్, విజేష్, సతీష్ రెడ్డి, తదితరులున్నారు.

నర్సాపూర్(జి) వాసికి అరుదైన గౌరవం

- ఎఫ్ఐడీఈ వరల్డ్ కప్‌కు అరుణ్ కుమార్ ఏకైక అంపైర్



గోవాలో చెస్ ఆడుతున్న నర్సాపూర్ (జి)కి చెందిన గాడి అరుణ్ కుమార్

నర్సాపూర్(జి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా, నర్సాపూర్(జి) మండలానికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్బిటర్, నేషనల్ కోచ్ అయిన గాడి అరుణ్ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన ఎఫ్ఐడీఈ చెస్ వరల్డ్ కప్ 2025కు అధికారిక న్యాయనిర్ణేత (అంపైర్)గా ఎంపికయ్యారు. గోవాలో నవంబరు 1 నుంచి 27 వరకు జరిగే ఈ మెగా టోర్నమెంట్‌కు 83 దేశాల నుంచి 206 మంది ప్రపంచ స్థాయి ఆటగాళ్లు హాజరవుతున్నారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక న్యాయనిర్ణేతగా అరుణ్ కుమార్ ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణం. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనలకు చెస్ కోచ్‌ఆ కూడా పని చేసిన అనుభవం ఆయనకు ఈ బాధ్యతల్లో కలిసొస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో దేశకీర్తిని పెంచుతున్న అరుణ్ కుమార్‌ను జిల్లా ప్రముఖులు, నర్సాపూర్(జి) మండల ప్రజలు ఘనంగా అభినందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని శుక్రవారం ఏవోకు వినతి పత్రం ఇచ్చినట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు రామగిరి రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూర్ సుధాకర్, న్యాయవాదులు డి.రమణగౌడ్, సుంకరి రాజు, చారి, రాజు మహారాజ్, కందూరు వినోద్, బిక్కు శాంతన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33/11 కేవీ ఆదర్శ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు వేసవి కాలంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయుటకు నిర్మిస్తున్నటువంటి 33 కేవీ టవర్ లైన్ పనుల దృష్ట్యా ఆదర్శనగర్, ఈద్గాం, గాయత్రి పురం, సిద్ధాపూర్, రాంనగర్, భాగ్యనగర్, మదీనా కాలనీ, మౌలానా ఆజాద్ నగర్, ఇరిగేషన్ ఆఫీస్, వెటర్నరీ హాస్పిటల్, సోఫీనగర్, మహమ్మదీయ మజీద్, విద్యానగర్, మంచిర్యాల క్రాస్ రోడ్ ఏరియాలలో ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

అమ్మకు అక్షర మాలపై శిక్షణ



అమ్మకు అక్షర మాల శిక్షణ కార్యక్రమానికి హాజరైన దృశ్యం

ముథోల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయ సమావేశపు మందిరంలో శుక్రవారం ముథోల్ మండల సమైక్య ఆధ్వర్యంలో అమ్మకు అక్షర మాలపై వీవో, ఓబీ, వీవోఏలకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. సీఆర్‌పీలు సుజాత, లలితలు అర్థమయ్యే రీతిలో సంపూర్ణ అక్షరమాల, సంఖ్యలు, అంకెలు, చిన్న చిన్న పదాలు గుర్తు పట్టేందుకు చేపట్టవలసిన అభ్యసన గురించి వివరించారు. సంపూర్ణ అక్షరాస్యత సాధించే లక్ష్యంతో ఏపీఎం గురుచరణ్ అధ్యక్షతన మహిళా సంఘాలకు రిసోర్స్ పర్సన్స్‌లతో ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. అమ్మకు అక్షరమాల అనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. అనివార్య కారణాల వల్ల చదువుకు దూరమైన పెద్దవారిని, మహిళలను మరలా చదువు వైపు ప్రోత్సహించి దీని ద్వారా వయోజనులను వృద్ధిలోకి తీసుకురావడం జరుగుతుందని ఏపీఎం తెలియజేశారు. మహిళల్లో అక్షట జ్యోతులు వెలిగించాలని ప్రభుత్వం సంకల్పించిందని నిరక్ష రాస్యత నిర్మూలన అర్ధాంతరంగా చదువు మానేసిన వారికి విద్యను అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేసిందని తెలియజేసింది. ఈ శిక్షణలో మహిళా సంఘాల సభ్యులు అక్షరాస్యత పెంపు, ఆర్థిక సాక్షరతా కార్యక్రమాల ప్రాధాన్యత, గ్రామస్థాయి మహిళా సాధికారతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృ తంగా చర్చించారు. అలాగే ముథోల్ భోస్లే గోపాల్ రావు కంటి ఆసు పత్రి కోఆర్డినేటర్ సాయన్న కంటి చూపు జాగ్రత్తలు తెలియజేశారు. కంటి వ్యాధులు, చికిత్స మార్గాల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం శోభారాణి, ఉల్లాస్ సమన్వయ సభ్యులు, మండల సమాఖ్య అధ్యక్షులు డి. జయశీల, సీసీలు సాయినాథ్, లక్ష్మణ్, గంగాధర్, గోదావరి, వీవో, ఓబీ, వీవోఏలు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

భైంసా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వరద బాధిత కుటుంబాలకు ఓ స్వచ్ఛంధ సంస్థ అందజేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ అందజేశారు. కుంటాల మండలంలోని లింబా (కే) గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ఇండ్లలోకి వరద వచ్చి చేరి తీవ్రంగా నష్టపోయారు. ఇందుకు స్పందించిన ఢిల్లీలోని నెస్లే స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో పలు కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా నిలిచిన స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులను సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ అభినందించారు. ఇందులో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

బాసరలో ఆజానుబావుడు

- 8 అడుగుల ఎత్తుతో శ్రీనివాసరావు ప్రత్యేక ఆకర్షణ



శ్రీనివాస్‌రావుతో సెల్ఫీ దిగుతున్న దృశ్యం

బాసర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):తెలంగాణలోని ప్రసిద్ధ జ్ఞాన సరస్వతి దేవాలయం బాసరలో శుక్రవారం రోజున భక్తులతో సందడి నెలకొంది. అయితే కృష్ణాజిల్లాకు చెందిన ఒక భక్తుడు ఆలయానికి రావడంతో అందరి దృష్టి అతనిపైనే పండింది. 8 అడుగుల ఎత్తుతో ఆజానుబావుడు అనిపించుకున్న శ్రీనివాసరావును చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. అందరికంటే ఎత్తులో గల తల, విశిష్టమైన ఆకారంతో కనిపించిన శ్రీనివాసరావును చూసి ఆశ్చర్య పోయిన భక్తులు, అతనితో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. గుడి ప్రాంగణమంతా అతని చుట్టూ జనం గుమిగూడారు.

12న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి పత్రిక ప్రకనటలో తెలిపారు. యువతలో దాడి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం యువజన సంబరాలకు స్వీకారం చుట్టింది. చదువుతో పాటు కళలు, కళా ప్రదర్శనలు ఆటల్లో యువతకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 15 నుంచి 29మధ్య వయస్సు వారు మాత్రమే అర్హులని ఆసక్తి కలిగిన యువతీ యువకులు హాజరు కాగలరని అన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 12 వరకు జాతీయ స్థాయిలో జరిగే వేడుకలకు పంపిస్తారని తెలిపారు.

చెకుముఖి పరీక్ష



ఎల్విలో చెకుముఖి పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

తానూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో భాగంగా 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నట్లుగా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, సుదర్శన్, సుజాత , దేవి, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీవోగా జాదవ్ ప్రదీప్



ఎంపీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్

భైంసా రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కా ర్యాలయంలో శుక్రవారం ప్రదీప్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్- 1 పరీక్షల్లో విజయం సాధించి మొదటిసారిగా ఎంపీవోగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. గతంలో కార్యదర్శిగా ఇక్కడ సేవలందిం చాలని తెలిపారు. ఆయనకు పలువురు నాయకులు, అధికారులు, ప్రజలు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

దొంగ ఓట్లను గుర్తించే చర్యలు చేపట్టాలి

భైంసా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని అన్నీ వార్డుల్లో దొంగ ఓట్లను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్‌కు బీజేపీ పట్టణ కమిటి కోరింది. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌లకు బీజేపీ పట్టణ అధ్యక్షులు రావుల రాము ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధులు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రావుల రాము మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకవచ్చిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్)ను భైంసా పట్టణ పరిధిలోని అన్నీ వార్డులలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్

నిర్మల్ రూరల్, నవంబరే 7 (ఆంధ్రజ్యోతి): వారధి ఫౌండేషన్ వారు ప్రతి ఏటా రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో డెబిట్ విభాగంలో తెలంగాణ బాలికల పాఠశాల సోఫీనగర్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ డానియల్ తెలిపారు. పదో తరగతి చదువుతున్న ఎం.విన్యత, తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీనిధి, రుదిత్న, ప్రథ మ స్థానం సాధించారని, వీరికి రూ.36వేల బహుమతి అందజేయనున్నారని తెలిపారు. వీరికి గైడ్ టీచర్‌గా కల్పన పీజీటీ ఆంగ్లం వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

అరుణాచలం తిరుపతి బయలు దేరిన నిర్మల్ బస్సు



ఆర్టీసీ బస్సులో అరుణాచలం వెళ్తున్న భక్తులు

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపో నుంచి శుక్రవారం అరుణాచలం తిరుపతి ప్రత్యేక బస్సు బయలుదేరిందని డిపో మేనేజర్ కే. పండరి తెలిపారు. ఈ బస్సు ఈ రోజు ఒంటి గంటకు నిర్మల్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం కాణిపాకం చేరుకుంటుందని కాణిపాకంలో వరసిద్ధి వినాయకుడిని దర్శించుకొని వెళ్లూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అరుణాచలం సాయంత్రం చేరుకుంటుందని, స్వామివారి దర్శనం గిరి ప్రదక్షిణ ముగించుకొని రాత్రి అక్కడే ఉంటామని తెల్లవారు తిరుపతి వెళ్లి ఎస్ఎస్‌డీ టికెట్లు పొంది దిగువ తిరుపతిలో గల గోవింద రాజులు, పద్మావతమ్మను దర్శించుకొని వారు ఇచ్చిన టైంకు తిరుమల వెళ్లి స్వామివారిని దర్శించుకొని మంగళవారం నిర్మల్ చేరుకుంటుందని ఆయన తెలిపారు. అరుణాచలం నిర్మల్ నుండి వెళ్లడం 6వసారి అని ప్రయాణికుల కోరిక మేరకు అయోధ్య, శ బరిమలై, రామేశ్వరం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆయన కోరారు.

నూతన ఎంపీవోగా జాడి జ్యోతి



ఎంపీవో జాడి జ్యోతిని సన్మానిస్తున్న దృశ్యం

సోన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన గ్రూప్ - 2 ఫలితాలలో ఎంపికై మండల నూతన ఎంపీవోగా జాడి జ్యోతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బాధ్యతలు నిర్వహించిన ఎంపీవో మహేందర్ దిలావర్‌పూర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీవో మాట్లాడుతూ.. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మండల నాయకులు, అధికారుల సమన్వయంతో అ న్ని రకాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎంపీడీవో సురేష్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీవోకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై శిక్షణ



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం అరుణ

నిర్మల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో నగదు రహిత లావాదేవీలపై స్వశక్తి మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఐకేపీ ఏపీఎం అరుణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగదు రహిత లావాదేవాలు నిర్వహించడం ద్వారా పారదర్శకత్వం ఉంటుందని, శిక్షణ పొంది అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీనివాస్, సీఆర్పీలు దీపిక, సంధ్య, అరుణ, వీవోఏలు గంగామణి పాల్గొన్నారు.

దొంగతనానికి యత్నించిన ఐదుగురి అరెస్టు

ముథోల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం వేకువజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దొంగతనం చేసేందుకు వచ్చిన ఐదుగురు అనుమానితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ముథోల్ ఎస్సై బిట్ల పెర్సెస్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... శుక్రవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ముథోల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ 2 జి. గంగాధర్ తన సిబ్బందితో కలిసి బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తూ ఉన్నారు. ఈ సమయంలో పసుపు రంగు టీజీ 16టీ0628 నెంబర్ గల ఆటోలో కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు కుతిజ బేగం, అర్బజ్ ఖాన్ అలియాస్ షేక్ అల్బజ్, సోహెల్ ఖాన్ అలియాస్ ఆర్మన్ ఖాన్, సిద్దిక్ ఖాన్, శయాబాజ్ ఖాన్ అనే ఐదుగురు నిజామాబాద్, భైంసా ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించినట్లు తెలిపారు. వారిని తనిఖీ చేయగా ఒకరి వద్ద కత్తి, ఆటోలో ఒక రాడ్, సుత్తి, పంచ్ లభించాయి. విచారణలో ఐదుగురు కలిసి కుతిజ ఇంటి వద్ద సమావేశమై తాళం వేసిన ఇళ్లలో దొంగతనం చేయాలని పన్నాగాన్ని పన్నారు. ముథోల్ బస్టాండ్ సమీపంలోని ఒక ఇంటిపై దృష్టి పెట్టి వేచి చూస్తున్న వేళ పోలీసులు రావడంతో ఆటోలో కూర్చుని నటించారని విచారణలో బయటపడిందని ఎస్సై తెలిపారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 8 నవంబరు 2025



చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలి

తలమడుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చట్టలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రాధిక శుక్రవారం మండలంలోని సాయి లింగీ కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ ప్రస్తుత స్మార్ట్‌ఫోన్లు రావడంతో సైబర్ నేరాలు నేరగాళ్ల ఎక్కువ అయ్యారని, అలాంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అంతేకాకుండా ఆడపిల్లలు ఎవరైనా వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు భయపడకుండా ఇలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఆడపిల్లలు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. ఇందులో కేజీబీ ప్రిన్సిపాల్ అర్చన, పోలీస్ సిబ్బంది పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాధిక

నేడు తాంసిలో కార్తీక దీపోత్సవం

» హాజరుకానున్న కలెక్టర్, ఎస్పీలు

తాంసి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలో నేడు శనివారం రోజున కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్థులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు హాజరుకానున్నారు. సాయంత్రం ఏడు గంటలకు ఈ కార్యక్రమాన్ని స్థానిక మత్తడివాగు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, యువతీ యువకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తాంసి గ్రామ ప్రజలు కోరుతున్నారు.



» జిల్లాలో 982 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి
» గతంలోనే లక్కీడ్రా ద్వారా 618 మంది లబ్ధిదారుల ఎంపిక
» మూడు కేటగిరీల వారీగా అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు
» ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న పలు ఇళ్ల నిర్మాణాలు
» త్వరలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



• ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

చిగురిస్తున్న 'డబుల్' ఆశలు

ఆదిలాబాద్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల కలెక్టర్ రాజా ర్షిషా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. దీంతో అధికారులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్‌కే కాలనీతోపాటు మావల, జైనాథ్, ఉట్నూర్ మండలాల్లో వందలాది ఇళ్లనిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే ఎట్టకేలకు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధంకావడంతో డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

> గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పథకం జిల్లాలో ఓ అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. దీంతో అర్హులైన లబ్ధి దారులకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ పథకాన్ని పక్కనపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. అయితే గత ఐదేళ్ల క్రితం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులక కేటాయించకపోవడంతో వృథాగానే మారాయి.

మొదట మునిసిపల్ పరిధిలో..

జిల్లాలో 13 వందలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన మొదట మున్సిపల్ పరిధిలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరుచేసింది. చాలాచోట్ల ఇళ్ల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. అర్బన్‌ప్రాంతంలో పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించి ఆ తర్వాత మండలాల్లో నిర్మించిన ఇళ్లను కేటాయించే అవకాశం ఉంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని కేఆర్‌కే కాలనీ, మావల పరిధిలో 982 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈనెల చివరివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

ఇందిరమ్మ ఇళ్ల వైపే మొగ్గు

గతంలో పూర్తయిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల ను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతు న్న లబ్ధిదారులు మాత్రం ఇందిరమ్మ ఇళ్ల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో నాణ్య తలోపం, లబ్ధిదారులకు నచ్చిన విధంగా నిర్మాణాలు చేపట్టకపోవడం తదితర కారణాలతో డబుల్‌బెడ్‌రూమ్ వైపు ఆసక్తి చూపడంలేదని తెలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు ఎంతో హడావిడి చేసి లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో 618 మంది లబ్ధి దారులను కూడా ఎంపిక చేశారు. కానీ ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో అ ర్థాంతరంగా నిలిపివేశారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారుల వివరాల కోసం వార్డు అధికారులు ఆరాతీస్తున్నారు. అయితే ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, మరణించడం లాం టి పరిస్థితులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. కానీ కొంత మంది తాజామాజీ కౌన్సిలర్లు, అధికార పార్టీకి చెందిన చోటామోటా నేతలు తమ అనుచరులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు దక్కేలా అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తివివరాలను సేకరించిన తర్వాతే లబ్ధిదారుల జాబితాను (మిగతా 6వ పేజీలో..)

అప్పుడే బీటలు

ఐదేళ్ల క్రితం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను అధికారులు హడావిడి చేసి పూర్తిచేశారు. దీంతో పలు ఇళ్లకు అప్పుడే బీటలు వారాయి. కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది. దీంతో ఎవరూ ఇళ్లపై దృష్టి సారించలేదు. విద్యుత్‌తీగలు దొంగతనానికి గురి కాగా, వాటర్‌పైప్స్, కిటికీలు, తలుపులు, మరుగుదొడ్ల పైపులు పూర్తిగా ధంసమైపోయాయి. చాలా ఇళ్లలో అమర్చిన నీటి ట్యాంకులు ప్రస్తుతం కనిపించడం లేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా మళ్లీ మూన్నాళ్ల ముచ్చటగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇళ్లచుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయి. ఈయేడు కురిసిన భారీవర్షాలకు నిర్మాణాలు, ఇళ్లస్లాబ్‌లు దెబ్బతిన్నాయి. పైపై పూతలు, రంగులువేసి లబ్ధిదారులకు అప్పగించిన ప్రయోజనం ఉండదుంటున్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో లబ్ధిదారుల్లో అనుమానాలు వ్యక్తమవుతన్నాయి.

మరమ్మతులు చేపడుతున్నాం..

• షాకీర్ (హౌసింగ్ డీఈ ఆదిలాబాద్)

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మరమ్మతు పనులు ప్రారంభించాం. ఈనెల చివరి వరకు అన్ని రకాల పనులను పూర్తి చేస్తాం. నవంబరు 15 వరకు విద్యుత్ సరఫరాను పూర్తి చేసి మంచినీటి వసతిని కల్పిస్తాం. క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తిస్తున్నారు. జాబితాను ఫైనల్ చేసి అర్హులైన వారికే ఇళ్లను కేటాయిస్తాం.



బాధితులకు మొబైల్‌ను అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మొబైల్ ఫోన్ పోయిందా?
సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయండి

» ఎస్పీ అఖిల్ మహాజన్
» చోరీకి గురైన 117 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత

మావల, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మొబైల్ పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో లేదా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్ సమావేశ మందిరంలో జిల్లాలో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న, చోరీకి గురైన బాధితులకు 117 మొబైల్ ఫోన్లను (దాదాపు రూ.18 లక్షల విలువ చేసే) తిరిగి బాధితులకు అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1150 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేశామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. మొబైల్ దుకాణాల యజమానులు, రీపేరింగ్ దుకాణాల యజమానులు, మొబైల్‌ను కొనే ముందు యజమాని అనుమతి, సరైన పత్రాలు తీసుకోవాలని, దొంగ మొబైల్ ఫోన్లు కొంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, ప్రత్యేకబృందం సభ్యులు ఆర్ఎస్ఐ పి.గోపికృష్ణ, ఎంఏ రియాస్, మజీద్, త్రిశూల్, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.



యువరాజ్ మర్మాట్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

'పది'లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి

» ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ ఉపాధ్యాయులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీడబ్ల్యూటీయూ నాయకులు శుక్రవారం పీవోను కలిసి సన్మానించారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని ప్రాజెక్ట్ అధికారి యువరాజు మర్మాట్ హామీ ఇచ్చినట్లు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడబ్ల్యూటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెండ్యాల విజయ్ శేఖర్, జాదవ్ శివాజీ, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మడావి లక్ష్మణ్,జిల్లా నాయకులు ఎ.భూమేష్, చౌహన్ నెహ్రూ, చంపా బాయి, మున్ని బాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బోథ్, సోనాల, పొచ్చెర సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌లో పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

గుడిహత్నూర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చట్టబద్ధత లేకుండా కొనసాగుతున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఉట్నూర్‌లో నిర్వహించే ఆదివాసుల ధర్మయుద్ధం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్‌లను ఆదివాసీ సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్రకార్యదర్శి కొడప నగేష్ మాట్లాడారు. ఉట్నూర్‌లోని ఎంపీడీఓ గ్రౌండ్‌లో ధర్మయుద్ధం పేరిట చేపట్టే ఆదివాసిల భారీ బహిరంగ సభకు ఆదివాసీల సంఘాల నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా ఆద్యక్షుడు రాయిసిడం జంగు పటేల్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు తోడసం శంకర్, నాయకులు మేస్రం నాగ్‌నాథ్, మెస్రం మోహన్, కోట్నక గణేష్, చత్రుఘన్, తదితరులున్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు సన్మానం

మావల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సాధించి బాధ్యతలు చేపట్టిన తలమడుగు గ్రామానికి చెందిన వి.స్వప్నను సహకార యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు ముజఫర్ హుస్సేన్, శారద ఉద్యోగులు దినేష్, లక్ష్మీ, నయీం, తౌఫీక్, రజినీకాంత్, దీరేష్, అమరేష్, ఆశాజ్యోతి, సంజయ్, దేవుబాయి, రజిత, శశికళ, తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ రిజిస్టర్ స్వప్నను సన్మానిస్తున్న టీఎన్జీవో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.నవీన్‌కుమార్



బిర్సాముండా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ఉపాధ్యాయ బృందం

ఘనంగా బిర్సాముండా జయంతి వేడుకలు

ఇంద్రవెల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో భగవాన్ బీర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సంగీత, విజయ మాట్లాడుతూ భగవాన్ బిర్సాముండా ఆదివాసీల హక్కుల కోసం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని అభినందిచారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సౌమ్య, కృష్ణవేణి, ప్రతిభ, లక్ష్మీ, గౌతమీ, నాగలక్ష్మి, పూజా, రాధ, లలితా, ఛాయా, సంజీత, కాత్లే లలితా, ఆరాధన, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈవో బాధ్యతల స్వీకరణ

బోథ్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల ఎంపీఈవోగా రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీఈవోగా ఉన్న అతుల్‌కుమార్ డిప్యూటేషన్‌పై వెళ్లగా.. ఆయనస్థానంలో నూతన ఎంపీఈవోగా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ పి.ప్రభుకు ఆయనకు నియామక పత్రం అందజేశారు.



ఎంపీఈవోగా నియామక పత్రం అందుకుంటున్న రాజ్‌కుమార్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నార్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రికి అకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు తగిన చికిత్సలు అందించాలని, పౌష్టికాహారం తీసుకునేలా వారికి మంచి సలహాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట వైద్యులు రాంబాబు, కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ లక్ష్మి, ఆరోగ్య విస్తరణ అధికారి తులసీదాస్, నాందేవ్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ సుశీల, హెల్త్‌సూపర్‌వైజర్ జవహర్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి కె.మనోహర్



పశువుల అడ్డాగా మారిన తెలంగాణ క్రీడా ప్రాంగణం



ఎంపీడీవో కార్యాలయంలో పడి ఉన్న క్రీడా సామగ్రి

పశువుల పాకగా క్రీడా ప్రాంగణాలు

» నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారిన గ్రౌండ్
» గ్రామీణ క్రీడలకు కరువైన ఆదరణ
» ఏడాది కాలంగా ఎంపీడీవో కార్యాలయంలోనే క్రీడా సామగ్రి

తలమడుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాంగణాలు పశువుల పాకలుగా మారిపోతున్నాయి. గ్రామీణ యువకుల్లో దాగివున్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రతీ గ్రామ పంచాయతీలో ఎకరం నుంచి రెండు ఎకరాల వరకు క్రీడాప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అయితే ఆ క్రీడా ప్రాంగణాల నిర్వహణ లేక పశువుల పాకలుగా మారాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో దాదాపు 28 గ్రామ పంచాయతీలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను రూ.లక్షలతో ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణను మాత్రం గాలికి వదిలేశారు. ఈ ప్రాంగణాలు ఏ ఒక్క క్రీడాకారుడికీ ఉపయోగపడినట్లు దాఖలాలు లేవు. ప్రతీ గ్రామ పంచాయతీలో కేవలం ఫ్లెక్సీల బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ గ్రామ పంచాయతీ నిధులతో ఈ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ క్రీడా ప్రాంగణాల్లో ఎలాంటి ఆటలు ఆడిన సందర్భాలు లేవు. క్రీడాప్రాంగణం అలంకార ప్రాయంగా, పశువుల మేతకు నిలయంగా మారాయి.

మూలుగుతున్న క్రీడా సామగ్రి

గ్రామీణ క్రీడాకారణ ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడాకారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేసి ఏడాది గడిచింది. అయినా ఆ క్రీడాసామగ్రి నేటికీ ఎంపీడీవో కార్యాలయంలోనే మూలుగుతోంది. దీనిపై పలుమార్లు క్రీడాకారులు, యువజన సంఘాల సభ్యులు క్రీడా సామగ్రిని పంపిణీ చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టిలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.